## క్లుప్తంగా

### 'విద్యుత్ సౌకర్యం కల్పించండి'

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో పోచమ్మ ఆలయం, శ్మశానవాటికకు వెళ్లే దారిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు కడెంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. లింగాపూర్‌లో దేవారెడ్డి కుటుంబాన్ని, మండల కేంద్రానికి చెందిన చెన్నూరి రాజన్న తల్లి ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్ భూషణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు సతీశ్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సత్యంచారి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్


బ్యాగు అందజేస్తున్న డిపో సిబ్బంది

నిర్మల్‌టౌన్: బస్సులో మర్చిపోయిన ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాగును తిరిగి ఇచ్చి ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ చాటుకున్నాడు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి నిర్మల్ వస్తున్న రాజధాని ఏసీ బస్సులో ప్రయాణికుడు లక్ష్మణ్ ల్యాప్‌టాప్ బ్యాగు మర్చిపోయి బుస్సాపూర్ వద్ద బస్సు దిగి వెళ్లిపోయాడు. నిర్మల్ బస్టాండ్‌కు వచ్చాక డ్రైవర్ శేఖర్ బ్యాగును గమనించి డిపో అధికారులకు అప్పగించారు. ప్రయాణికుడి వివరాలను కనుక్కొని డిపోకు పిలిపించి బ్యాగును అతనికి అందజేశారు. డ్రైవర్ శేఖర్‌ను డిపో మేనేజర్ పండరి అభినందించారు.

### సోయా పంటల పరిశీలన

ముధోల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన సోయా పంటలను ఏఈవో సందేశ్ బుధవారం పరిశీలించారు. ముధోల్‌లోని ఎల్వత్ రోడ్డు వాగు పరీవాహక ప్రాంతాల్లోని వందల ఎకరాల్లోని పంట చేలల్లో నీళ్లు భారీగా నిలిచాయి. దీంతో సోయా పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని, పంట చేతికొచ్చే సమయంలో వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.30వేలు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

### పాఠశాలకు పూర్వ విద్యార్థి కలర్ ప్రింటర్ విరాళం


దాతను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి తాళ్ల సుదర్శన్ పాఠశాలకు కలర్ ప్రింటర్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో బుధవారం ఉపాధ్యాయులు తాళ్ల సుదర్శన్ –సవిత దంపతులను శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు సాయన్న, సంగీత, భూమేశ్, సురేశ్, గ్రామస్తులు అభినవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌వోసీ చెక్కు అందజేత

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బేస్తవారిపేట్ కాలనీకి చెందిన ఐశ్వర్య అనే బాలిక అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు బుధవారం అందజేశారు. నిర్మల్ మున్సిపల్ కౌన్సిలర్ సైండ్ల శ్రీధర్, గంగోని భూరాజ్, వొద్నాల రాజేశ్వర్, శ్రీనివాస్ గౌడ్, అంబేకార్ ప్రసాద్, గాజుల రవి కుమార్ ఉన్నారు.

### 'చాకిరేవు' సమస్య పరిష్కరించాలని వినతి

పెంబి: మండలంలోని దొందారి గ్రామ పంచాయతీ పరిధిలో గల చాకిరేవు గ్రామం ఏర్పడి 30 సంవత్సరాలు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేవని, గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని బుధవారం దొందారి గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేంద్రకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామ కమిటీ సభ్యులు శంభు, మాన్కు, జైతు, మారుతి ఉన్నారు.

### 'గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

సోన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నక్కల మధుకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పార్టీని గ్రామ, బూత్ స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విపత్తు వేళ..చేయూతనిచ్చేలా


బాధిత కుటుంబాలకు పండ్లు పంపిణీ చేస్తున్న కావేరి సంస్థ ప్రతినిధులు(ఫైల్)

- వరద ప్రభావిత ప్రాంతాల్లో 'స్వచ్ఛంద' సేవలు
- అండగా నిలుస్తున్న సామాజిక నేస్తాలు

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా అతలాకుతలమైంది. వరదల కారణంగా పంటలు నష్టపోవడం, ఇళ్లలోకి నీరు చేరడం, రోడ్లు దెబ్బతినడం, జీవనాధారం కోల్పోవడంతో ప్రజలు, రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు నష్టపోయారు. ఇలాంటి విపత్తుల వేళ బాధితులకు అండగా నిలిచేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత, సామాజికవేత్తలు ముందుకువచ్చి చేయూతనిస్తున్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

**'కావేరి'ఆధ్వర్యంలో ఆహార పదార్థాల వితరణ**

ఇటీవల ఏకధాటిగా కురిసిన భారీ వర్షం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. పలు కాలనీల్లోని ఇళ్లు, రహదారులు, అంతర్గత రోడ్లపై నీరు చేరడంతో వారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కాగా అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని పేద ప్రజలకు పులిహోర, పండ్లు, బిస్కెట్లు తదితర ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధరి ప్రతినిధులతో కలిసి ముంపు ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విష జ్వరాలు, అనారోగ్యం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని భరోసానింపారు.

**సేవే లక్ష్యంగా..**

అటు ఆధ్యాత్మికతతోపాటు ఇటు సామాజిక సేవ రంగంలోనూ విపత్తు వేళ తమ శక్తి మేర తోడ్పాటునందిస్తున్నారు అయ్యప్ప సేవ సమితి ప్రతినిధులు. జిల్లా కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి సంస్థను ఏర్పాటు చేసుకుని సామాజిక సేవ రంగాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారికి తినుబండారాలు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బద్రి శ్రీనివాస్, కనపర్తి విగ్నేశ్‌తో కూడిన సేవా సమితి బృందం ఇళ్లలోకి నీరు చేరి కనీసం వంట చేసుకునే స్థితిలో లేని కుటుంబాల కోసం పాలు, అల్పాహారం, బ్రెడ్ తదితర అందజేశారు. వీటితోపాటు సమస్యలు ఉంటే సంప్రదించాలంటూ బాధితుల్లో భరోసా నింపుతున్నారు. స్వచ్ఛంద సేవలు పొందాలనుకునేవారు 9666281117 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రచార ఆర్భాటాలు లేకుండా సేవలో..**

జిల్లా కేంద్రంలోని నటరాజ్‌నగర్ కాలనీకి చెందిన కొందరు యువకులు కలిసి వర్షం ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించే క్రమంలో పోలీసులకు తోడ్పాటు అందించారు. ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా తమ వంతు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

## మహిళా సంఘాలు భాగస్వాములు కావాలి

దస్తురాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడంలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సత్యసాయి గ్రామ సమైక్య సంఘ భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మండలానికి రూ.88 లక్షల వడ్డీ లేని రుణం వచ్చిందన్నారు. నిధులు అందించిన ఎమ్మెల్యేను మహిళలు ఘనంగా సన్మానించారు. అనంతరం పేర్కపల్లెలో అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి, మండల కేంద్రంలో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ పడిగల భూషణ్, తహసీల్దార్ విశ్వంబర్, ఏపీఎంలు రమేశ్, గంగన్న సింగరి కిషన్ నాయకులు ఉన్నారు.

**గ్రామాల్లో పర్యటిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..**

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ పంచాయతీ పరిధిలో గల కొత్తవాడతో పాటు మేడంపల్లి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పర్యటించారు. ఉదయాన్నే ఆయా గ్రామాలకు వెళ్లి మార్నింగ్ వాక్ చేస్తూ వర్షాకాలంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతితో పాటు ఇళ్లను నిర్మించుకుంటున్న వారికి బిల్లులు అందుతున్న తీరు పరిశీలించారు. కొత్తవాడ నుంచి మామడ మండలం వెంకటాపూర్ వెళ్లే మార్గంలో రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా ఈ విషయమై అటవీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు కోసం అటవీ అనుమతుల ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే అటవీ అధికారులకు సూచించారు. అనంతరం మేడంపల్లి శివారులో గల సదర్మాట్ ఆనకట్టను సందర్శించి గోదావరి నుంచి వస్తున్న భారీ వరదలను పరిశీలించారు. చేపలు పడుతున్న జాలర్లతో మాట్లాడారు. గుగ్లావత్ రాజునాయక్, జంగిలి శంకర్ తదితరులు ఉన్నారు.


సదర్మాట్ వద్ద చేపలు పడుతున్న జాలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

**'గిరిజనుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బీఆర్‌ఎస్'**

ఖానాపూర్: ఉట్నూర్ ఐటీడీఏతో పాటు భద్రాచలం ఐటీడీఏ సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్కతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేల పట్ల బీఆర్‌ఎస్ నాయకులు దుష్ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ లంబాడీలకు వ్యతిరేకంగా పనిచేస్తుందనే ప్రచారం మానుకోవాలన్నారు. గిరిజనుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తున్న కాంగ్రెస్‌ను విమర్శించడం మానుకోవాలన్నారు. భూషన్, దయానంద్, రమేశ్, సత్యం, రాజేందర్, గంగనర్సయ్య, శ్రీనివాస్, శంకర్, రాము, జాని, శేషాద్రి తదితరులు ఉన్నారు.

## యువత శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సారంగపూర్: నేటి యువత ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల సాధనకు శ్రమించాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వైకుంఠాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శివాజీ ధైర్యం, సాహసం, వ్యూహాలు, యుద్ధనీతిలో ఆయన తెగువ యావత్ ప్రపంచానికి తెలుసునన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నరేశ్, గ్రామ యువకులు తదితరులు ఉన్నారు.


శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**ఎమ్మెల్యే పరామర్శ**

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామానికి చెందిన నర్సాగౌడ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం నర్సాగౌడ్‌ను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు అడ్వాల రమేశ్, రాజు, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## చెంచులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామ సమీపంలో గల చెంచులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం చెంచులతో కలిసి తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా కనీస సౌకర్యాలకు నోచుకోకుండా చెట్ల కింద గుడారాల్లో జీవనం సాగిస్తున్నారని, ఇకనైన ప్రజా ప్రభుత్వంలో వీరికి ఇళ్లు నిర్మించి న్యాయం చేయాలని కోరారు. ఇందులో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, చెంచులు పూజిత, రజిత, గంగాధర్ తదితరులు ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## సంక్షిప్త వార్తలు

**● రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు**

భైంసాటౌన్: నియోజకవర్గంలో పలురోడ్ల నిర్మాణానికి గిరిజనాభివృద్ధి శాఖ నుంచి రూ.12.50 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. తరోడా తండా నుంచి ఎడ్‌బిడ్ తండా వరకు 10 కి.మీ. రోడ్డుకు రూ.5.80 కోట్లు, రువ్వి తండా నుంచి ముధోల్ 161బీబీ హైవే వరకు 7.50 కి.మీ నిర్మాణానికి రూ.6.70 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి నుంచి పార్ తండా వరకు బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరైనట్లు మండల బీజేపీ అధ్యక్షుడు చిన్నయ్య, మండల బీజేపీ నాయకులు అడ్వాల రమేశ్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి బీటీ రోడ్డు పనులకు రూ.50 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు.

**● బాధిత కుటుంబానికి పరామర్శ**

సారంగపూర్: మండల కేంద్రానికి చెందిన కళాకారుడు టేకులపల్లి భోజన్న తండ్రి పెద్దన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని బుధవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. పెద్దన్న మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, నాయకులు గాజుల రవికుమార్, నర్సారెడ్డి, ఓలాద్రి నారాయణరెడ్డి, బూరాజీ, నారాయణరెడ్డి, ఏనుగు ముత్యం రెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

**● భారీ వర్షం**

లక్ష్మణచాంద: వారం క్రితం వరకు మండలంలో కురిసిన భారీ వర్షాలకు అన్నదాతలు సాగు చేస్తున్న పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజులు తెరిపినిచ్చిన వర్షం బుధవారం మధ్యాహ్నం నుంచి మండలంలో మళ్లీ కురిసింది.

**● నాయబ్ తహసీల్దార్‌గా రాకేశ్**

కుంటాల: కుంటాల నాయబ్ తహసీల్దార్‌గా రాకేశ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన నరేశ్ గౌడ్ డిప్యూటేషన్‌పై భైంసా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు.

**● శ్రమదానం**

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామ ముఖ ద్వారం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బుధవారం స్వాధ్యాయ పరివార్ సభ్యులు శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు.

**● నేత్రదానంపై అవగాహన**

నిర్మల్ టౌన్: నేత్రదానం చేసి అంధత్వాన్ని నిర్మూలించాలని లక్ష్మి కావేరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రవి కుమార్ రెడ్డి, డాక్టర్లు రామకృష్ణ, సోనియా అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకొని (నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్నెస్ ) ఎన్‌పీసీబీ పిలుపు మేరకు. బుధవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మి కావేరి కంటి ఆసుపత్రిలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**● కాంగ్రెస్‌లో భారీగా చేరికలు**

భైంసాటౌన్: నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ముందుగా బీసీ రిజర్వేషన్ అమలు చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కుభీర్ మండలానికి చెందిన యువ నాయకుడు రవికుమార్ ఆధ్వర్యంలో దాదాపు 1800 మంది పార్టీలో చేరినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

**● ఖానాపూర్‌కు ఆధార్ కేంద్రం**

ఖానాపూర్: మండలంలో నూతనంగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో రత్నాకర్ రావు బుధవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం పక్కనే గల ఇందిరమ్మ మోడల్ హౌస్‌లో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

**● చెరువుకు మరమ్మతులు**

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో గల పెద్ద చెరువుకు బుధవారం బుంగపడ్డ విషయాన్ని గ్రామస్తులు తెలిపిన వెంటనే తహసీల్దార్ సుజాత స్పందించారు. వెంటనే గ్రామానికి చేరుకుని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి దగ్గరుండి బుంగపడ్డ చోట మరమ్మతులు చేయించారు.

**● ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి**

లక్ష్మణచాంద: మండలంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ అన్నారు. బుధవారం పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష సూచనల మేరకు పీచర గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేసి మందులు అందించారు.

**● మౌలిక వసతులు కల్పిస్తాం**

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఆర్పీ మురళీధర్ ఎస్‌పీహెచ్‌ఆర్‌పై ఒక రోజు శిక్షణ ఇచ్చారు.

### డీఈవోను కలిసిన ఉపాధ్యాయులు


డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కడెం: ఇటీవల డీఈవోగా బాధ్యతలు చేపట్టిన భోజన్నను బుధవారం డీఈవో కార్యాలయంలో మండలంలోని ఆయా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈవోను శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు వినీత్, పద్మాకర్, జోసఫ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

### చీఫ్ సెక్రెటరీని కలిసిన మాజీ మంత్రి


పూల మొక్క అందజేస్తున్న ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌టౌన్: చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావును హైదరాబాద్‌లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేశారు. ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలతో జరిగిన పంట, ప్రజల ఆస్తుల నష్టాలపై చర్చించారు. బాధితులకు నష్టపరిహారం అందించాలని విన్నవించారు. సీనియర్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, లోక భూమారెడ్డి, అజ్మీర శ్యాంనాయక్ ఉన్నారు.

### మహిళల గాజుల సవ్వడి!


గాజులు వేసుకుంటున్న మహిళలు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని నరసింహ కాలనీలో మహిళలు బుధవారం గాజుల సవ్వడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు పసుపు, కుంకుమ పెట్టుకొని, వాయినాలు ఇచ్చుకొని గాజులు వేసుకున్నారు. అనంతరం ఆట, పాటలతో నృత్యాలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు.

## కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు


లక్ష్మణచాంద: రాచాపూర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న గ్రామస్తులు


నిర్మల్‌టౌన్: కుంకుమార్చనలో భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాలలో వినాయకుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో వినాయకుల వద్ద పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలో యువనేత ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద బుధవారం కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పూజలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలోని గణేశ్ మండలి ఆధ్వర్యంలో బుధవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే వేద పండితులు పవన్‌శుక్లా లలిత సహస్రనామాలు, పారాయణం, అష్టోత్తరాలు, గణపతి గౌరీ పూజ మొదలగు పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### నిమజ్జనానికి ఏర్పాట్లు


బంగల్‌పేట్ వినాయక సాగర్ చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ కంచె


భైంసాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

జిల్లా కేంద్రంతో పాటు భైంసా పట్టణంలో వినాయక నిమజ్జనం శోభాయాత్ర కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులపై గుంతలు పూడ్చి వేశారు. విద్యుత్ స్తంభాలను సరి చేయడంతో పాటు బంగల్‌పేట్ వినాయక సాగర్ చెరువు కట్టపై ఇరువైపులా రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. భైంసా పట్టణంలో ఎస్పీ జానకీషర్మిల పర్యవేక్షణలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 12 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, 600 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని కూడళ్లు, ప్రధాన మార్గాల్లో 120 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్/ భైంసా


### ఘనంగా 'గణేశ్' శోభాయాత్ర


నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులు


భారీ వర్షంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రుల్లో భాగంగా గణేశ్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం రాత్రి వరకు కూడా వినాయక నిమజ్జనాల శోభాయత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

## హడావుడి పనులు.. ముందుచూపు కరువు!


పురాణాబజార్ వెళ్లే మార్గంలో గుంతల రోడ్డు

భైంసాటౌన్: పట్టణంలో వినాయక నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే తూతూమంత్రంగా, అప్పటికప్పుడు హడావుడిగా పనులు చేపడుతుండడంతో మళ్లీ యథాస్థితి నెలకొంటోంది. శోభాయాత్ర మార్గంలో రోడ్లపై గుంతలను పూడ్చివేసే పనులు చేపట్టారు. కానీ కొన్నిచోట్ల అలాగే వదిలేశారు. దీంతో గుంతల్లో నీరు నిలిచి అధ్వానంగా మారింది. ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది. సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.